రహదారి పూర్తయ్యేదెప్పుడో?

పూసూరు నుంచి ఏడ్జర్లపల్లి వరకు మెటల్ వేసి వదిలేసిన కాంట్రాక్టర్

- కల్వర్టులు, బ్రిడ్జిల వద్ద అసంపూర్తిగా నిర్మాణాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

వాజేడు: మండల పరిధిలోని ఏడ్జర్లపల్లి నుంచి గుమ్మడిదొడ్డి వరకు ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద 12 కిలో మీటర్లు డబుల్ రోడ్డు మంజూరైంది. ఈ రహదారి నిర్మాణానికి రూ.13 కోట్ల 65 లక్షల 18 వేలు కేటాయించారు. కాగా పనులను 2022 డిసెంబర్ 21న ప్రారంభించారు. 2023 మే 20 నాటికి పనులను పూర్తి చేయాల్సి ఉంది. కాని పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. రహదారి పనుల్లో పురోగతి లేక పోవడం అటు కాంట్రాక్టర్‌తో పాటు ఇటు ఇంజనీరింగ్ అధికారులు పట్టించు కోకపోవడంతో రహదారి పనులు పూర్తి చేస్తారా? లేదా? అనే అనుమానాలు నెలకొన్నాయి.

రాని అనుమతులు

రహదారి నిర్మాణంలో ఉన్న స్థలంలో కొంత రిజర్వ్ ఫారెస్టులో ఉంది. దీని అనుమతి కోసం కేంద్ర ప్రభుత్వానికి నివేదికలను పంపించినప్పటికీ ఇంత వరకు అనుమతులు రాలేదు. దీంతో మండల కేంద్రం నుంచి డబుల్ బెడ్రూమ్ ఇళ్ల వరకు రహదారి పనులు నిలిపివేశారు.

ప్రారంభం కాని రివిట్ మెంట్ పనులు

మండల కేంద్రం సమీపంలో రూ.4.85 కోట్ల వ్యయంతో హైలెవెల్ బ్రిడ్జిని నిర్మించారు. బ్రిడ్జి నిర్మాణం ఎత్తుగా నిర్మించడంతో ఇక్కడ కంకర వేసి మెటల్ పోశారు. కాని రహదారికి ఇరువైపులా గోడ లేదా రాయితో రివిట్ మెంట్ చేయాల్సి ఉంటుంది. ఇంత వరకు ఆ పనులను మొదలు పెట్టలేదు.



మెటల్ వేసి వదిలేసిన తారు రోడ్డు

మెటల్ వేసి వదిలేశారు

మండల పరిధిలోని పూసూరు గ్రామం నుంచి ఏడ్జర్లపల్లి గ్రామం చివరి వరకు రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా మెటల్ వేశారు. దానిని రోలింగ్ చేసి తారు వేయాల్సి ఉంది. కాని ఇంత వరకు దాని ఊసే లేదు. ఇంకా సుమారు అర కిలోమీటర్ మేర పాత రహదారిని తొలగించాల్సి ఉంది. అలాగే 12 కిలో మీటర్ల రహదారి నిర్మాణంలో భాగంగా పూసూరు, ఏడ్జర్లపల్లి గ్రామాల మధ్య రెండు కల్వర్టులను నిర్మించారు. రహదారిపై మరో రెండు చోట్ల కల్వర్టుల పనులను ఇప్పటికీ ప్రారంభించలేదు. వాజేడు, గుమ్మడిదొడ్డి గ్రామాల మధ్యన హైలెవెల్ వెంతెనతో పాటు కొంగాల వాగుపై బ్రిడ్జిని నిర్మించారు. కొంగాల వాగు బ్రిడ్జి సమీపంలో ఏడ్జర్లపల్లి, పూసూరు గ్రామాల మధ్య నిర్మించిన కల్వర్టుల వద్ద ఇంకా మట్టి రోడ్డు దర్శనమిస్తుంది. మెటల్ వెయ్యక పోవడంతో గుంతల మయంగా మారిన రహదారి ప్రమాదకరంగా ఉంది. కల్వర్టుల వద్ద వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

పగుళ్లు తేలిన రోడ్డు

కొంగాల వాగు వద్ద నుంచి గుమ్మడిదొడ్డి గ్రామం వరకు వేసిన తారు రోడ్డు చాలా చోట్ల పగుళ్లు తేలింది. ఇది ఇలాగే కొనసాగితే రహదారి దెబ్బతినే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నాణ్యత లోపించిన కారణంగానే తారు రోడ్డు పగుళ్లు తేలిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డును నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

పనులు పూర్తిచేయాలి

నిలిపివేసిన రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలి. రహదారి పనులను పూర్తి కాకపోవడంతో ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నాం. పంట చేలకు, మండల కేంద్రానికి ఈ రహదారిపైనే వెళ్లాల్సి వస్తుంది.

– సత్యనారాయణ, వాహనదారుడు



కల్వర్టు వద్ద మట్టి రోడ్డు



తొలగించని పాత రహదారి



రివిట్ మెంట్ చేయని రోడ్డు

రోడ్డుకు మరమ్మతు చేయాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న ప్రజలు

వెంకటాపురం(కె): రహదారిని మరమ్మతు చేయాలని మండల పరిధిలోని యాకన్నగూడెం వద్ద రహదారిపై గ్రామస్తులు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. రహదారి మరమ్మతుల కోసం తవ్విన కాంట్రాక్టర్ ఇంత వరకు బీటీ పనులను చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని రహదారిపై బైఠాయించారు. బీటీ పోవడంతో దుమ్ము, ధూళి లేచి ప్రయాణానికి ఇబ్బందులు తలెత్తడంతో పాటు శ్వాస కోశ సంబంధిత వ్యాధుల భారిన పడుతున్నట్లు వాపోయారు. రహదారికి ఇరువైపులా పంటలపై దుమ్ము చేరడంతో నష్ట పోతున్నట్లు తెలిపారు.

ప్రమాదకరంగా గుంత



ప్రమాదకరంగా ఉన్న గుంత

వాజేడు: మండల పరిధిలోని పూసూరు, ఏజ్జర్లపల్లి గ్రామాల మధ్యన తోగు నీరు గోదావరి వైపునకు వెళ్లడానికి అనుకూలంగా కింద తూములను వేసి చప్టాను నిర్మించారు. చప్టా కింద ఉన్న తూము పగిలి గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు చూసుకోకుండా వెళితే అందులో పడి గాయాల భారిన పడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ములుగు రూరల్: మండలంలోని బండారుపల్లి మోడల్ పాఠశాలలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి 2025 జనవరి 6 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ సింగారం దేవకి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోవ తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ విద్యార్థులు రూ.125, ఓసీలు రూ.200 చొప్పున దరఖాస్తు ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని సూచించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



వెంకటాపురం(ఎం): మండలంలోని లక్ష్మీదేవిపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రెండు వేల రూపాయాల విలువచేసే స్టడీ మెటీరియల్‌ను దాత నల్లబెల్లి సాంబయ్య ఉచితంగా అందించగా ఎంఈఓ తాళ్ల ప్రభాకర్ చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. .. విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. హెచ్ఎం సూత్రాల రవి, మాజీ సర్పంచ్ గట్టు కుమారస్వామి, ఉపాధ్యాయులు పెండ్యాల సత్యేంద్రం, సర్వర్ అహ్మద్, గ్రామ పెద్దలు కారుపోతుల యాదగిరి, గుండె యాదగిరి, రాజమౌళి ఉన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు సౌమ్య



వెంకటాపురం(ఎం): మేడ్చల్ జిల్లాలోని హకీంపేటలో ఈనెల 24, 25న నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు మండల కేంద్రంలోని మైనార్టీ కళాశాలకు చెందిన సౌమ్య ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ వందన, పీడీ నవ్య తెలిపారు. ఇటీవల కర్లపల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో సౌమ్య ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా సౌమ్యను అధ్యాపక బృందంతో పాటు సహచార విద్యార్థులు అభినందించారు.

యాదవ సంఘం అధ్యక్షుడిగా రవి



వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలో యాదవ సంఘం గ్రామ కమిటీని సోమవారం ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా జంగిలి రవి, ఉపాధ్యక్షుడిగా బొంతల సంపత్, ప్రధాన కార్యదర్శిగా ఎల్లావుల మల్లేష్, కోశాధికారిగా చీకుర్తి రమేష్, సభ్యులుగా అయిలుకోమురు, కుమారస్వామి, రమేష్, రాజు ఎన్నికయ్యారు.

పనులు షురూ..



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై సెంట్రల్ లైటింగ్ నిర్మాణం కోసం సీఆర్ఆర్ గ్రాంటుతో రూ.75 లక్షలు నిధులు మంజూరయ్యాయి. వాటితో పనులు మొదలు పెట్టేందుకు గతంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన ఫెనింగ్ తొలగింపు పనులు సోమవారం చేపట్టారు. గ్రామ పంచాయతీ సిబ్బంది సెంట్రల్ లైటింగ్ పనులకు అడ్డు లేకుండా ఫెన్సింగ్‌ను తొలగిస్తున్నారు. అయితే మొక్కల కోసం వేసిన ఫెన్సింగ్‌ను మళ్లీ సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ పనులు ఏర్పాటు పూర్తి అయిన తర్వాత జాలీ ఫెన్సింగ్‌ను అమర్చనున్నట్లు అధికారులు తెలిపారు.

‘సికిల్ సెల్’ పరీక్షలు



వాజేడు: మండల పరిధిలోని జంగాలపల్లి గ్రామంలో సోమవారం సికిల్ సెల్ పరీక్షలను వైద్య ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. రక్త కణాలు గుండ్రంగా ఉన్నాయా లేదా అర్ధ చంద్రాకారంలో ఉన్నాయ అని తెలుసుకోవడానికి ఈ పరీక్షలను నిర్వహించారు. 5 సవత్సరాల నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉన్న వారికి ఈ పరీక్షలు చేశారు.

దత్తాత్రేయ ఆలయంలో ప్రత్యేక పూజలు

కాటారం: మండలంలోని శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో సోమవారం భక్తులు సామూహికంగా అనఘాదేవి వ్రతం నిర్వహించారు. ఆలయ పురోహితులు కృష్ణమోహన్ ఆధ్వర్యంలో భక్తులు వేదమంత్రోచ్చరణల మధ్య అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అత్యంత భక్తిశ్రద్ధలతో వ్రతం చేశారు. కాంగ్రెస్ యూత్ నాయకుడు, మంత్రి శ్రీధర్‌బాబు సోదరుడు శ్రీనుబాబు దత్తాత్రేయుడు, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఐక్యంగా ఉద్యమించాలి

- పొదెం కృష్ణ ప్రసాద్

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని విద్యాసంస్థల్లో పనిచేసే కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయులు ఐక్యంగా ఉద్యమించి హక్కులను, డిమాండ్‌లను సాధించుకోవాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయుల సంఘం గౌరవ అధ్యక్షుడు పొదెం కృష్ణ ప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ పక్కన ఉన్న ప్రధాన రోడ్డుపై ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయులు నిరవధిక సమ్మెను చేపట్టగా కృష్ణప్రసాద్ హాజరై మాట్లాడారు. సీఆర్టీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు పొదెం రవీందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో 2003 సంవత్సరాల నుంచి కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్ వ్యవస్థ ప్రారంభమైన ఇప్పటి వరకు చాలీ చాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



సమ్మెలో మాట్లాడుతున్న పొదెం కృష్ణప్రసాద్

పంచాయతీ స్థలాన్ని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న చంద్రయ్య

ములుగు రూరల్: మండలంలోని జాకారం పంచాయతీ స్థలాన్ని కాపాడుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి గుండబోయిన చంద్రయ్య అన్నారు. సోమవారం జాకారం పంచాయతీ స్థలాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. పంచాయతీ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమణకు గురి చేస్తూ నిర్మాణాలు చేపట్టాడాన్ని ఆయన ఖండించారు. గ్రామ పంచాయతీ స్థలం జాతీయ రహదారికి ఆనుకొని ఉన్నందున షెటర్లు ఏర్పాటు చేస్తే పంచాయతీకి శాశ్వత ఆదాయ వనరుగా మారుతుందని అన్నారు. స్పెషల్ ఆఫీసర్ పాలనలో ఆక్రమనకు గురవుతున్నా గ్రామ అభివృద్ధి కమిటీ మౌనంగా ఉండడం సరికాదని అన్నారు. జిల్లా పంచాయతీ అధికారి విచారణ జరిపించి అక్రమ నిర్మాణాలను కట్టడి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజన్న, ఆదిరెడ్డి, చంద్రునాయక్, సాంబయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై వంటావార్పు చేసి నిరసన



రోడ్డుపై భోజనం చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

ములుగు: ఇన్నాళ్లు క్షేత్రస్థాయిలో విద్యార్థుల ఉన్నతికోసం పనిచేసి తమకు కష్టం వచ్చిందంటే ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించడం లేదని ఆదుకుంటారా.. రోడ్డున పడేస్తారా ప్రభుత్వానికే వదిలేస్తున్నామని సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఆవరణలో చేపడుతున్న దీక్ష సోమవారంతో 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగులు రోడ్డుపై వంటావార్పు చేసి నిరసన తెలిపారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి భోజనం చేసి సూత్రపాయంగా తమ బతుకులు రోడ్డుపై పడ్డాయని ప్రభుత్వానికి తెలియజేశారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆదిరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, కోశాధికారి కుమార్ పాడ్య, ఉపాధ్యక్షుడు ఫిరోజ్, కార్యవర్గ సభ్యులు సుజాత, రమేష్, సమన్వయకర్తలు రాజేశ్వరీ, జయ, వసంత, వెంకటలక్ష్మీ, శిరీష, సుజాత, అరుణ, భాగ్యలక్ష్మీ, ప్రవీణ్, నాలంబాయి, రవి పాల్గొన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని వందన ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో రైతు దినోత్సవ వేడుకలు సోమవారం నిర్వహించారు. రైతుల ఔన్నత్యాన్ని ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ప్రధానోపాధ్యాయుడు సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో మధ్యాహ్న భోజనం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న తహసీల్దార్ సృజన్ కుమార్

గోవిందరావుపేట: దాతల సహకారంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ చంద్రకళ ఆధ్వర్యంలో తహసీల్దార్ సృజన్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన విద్యావేత్త ఎస్ఆర్ఐ వీరపనేని డాంగే కళాశాలలో చదువుతున్న 200 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్యక్రమానికి దాతగా ముందుకు రావడం సంతోషకరమైన విషయమన్నారు. మండలంలోని రైస్ మిల్లర్స్ యజమానులు రామకృష్ణ, సతీష్, శేఖర్ రెడ్డి మధ్యహ్న భోజన కార్యక్రమానికి సహకరించడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో దాత వీరపనేని లక్ష్మీ, సోమారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి బాధితులను ఆదుకోవాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ

వాజేడు: జగన్నాథపురం నుంచి చెరుకూరు వరకు నిర్మించనున్న జాతీయ రహదారి విస్తరణలో ఇళ్లు, దుకాణాలు కోల్పోతున్న బాధితులకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో సోమవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో పేద ప్రజల ఇళ్లు, దుకాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారికి ఇరువైపులా ఉన్న ప్రజలకు అవగాహన కల్పించి వారికి జరిగే నష్టం విలువను ముందుగానే తెలిపి పరిహారాన్ని వెంటనే ఇచ్చేలా చూడాలన్నారు. సర్వే సమయంలో కొంత పోతుందని తెలిపి ప్రస్తుతం ఎక్కువ భాగం పోతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు పెసా గ్రామ సభల ద్వారా ప్రజల అభిప్రాయాలను తీసుకోవాలన్నారు. పెసాకు పలు హక్కులు ఉన్నాయని అటు వంటి చట్టాన్ని ప్రభుత్వాలు పెడ చెవిన పెడుతున్నట్లు విమర్శించారు. మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి, గుగ్గిళ్ల దేవయ్య, కృష్ణ బాబు, సౌమ్య, నాగేశ్వరరావు, కుమారి, చంద్రశేఖర్, నరేష్, వెంకటేశ్వర్లు, ఉదయ, ప్రవీణ్, రవీందర్, అశోక్ తదితరలు ఉన్నారు.



మాట్లాడుతున్న సాంబశివ

పంటలకు మద్దతు ధర చట్టం చేయాలి



ములుగు రూరల్: ధర్నా చేస్తున్న నాయకులు



గోవిందరావుపేట: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

- రైతు సంఘాల నాయకులు

ములుగు రూరల్: రైతులు పండించిన పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు అమ్జద్‌పాషా, గఫూర్, చంద్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విదానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా అఖిల భారత సంయుక్త మోర్చా పిలుపులో భాగంగా ధర్నా చేపట్టారు. ముందుగా మార్కెట్ పాలసీ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీ సరిహద్దుల్లో ధర్నా చేపడుతుండగా అరెస్టు చేసిన రైతులను విడుదల చేయాలని అన్నారు. జాతీయ వ్యవసాయ, మార్కెట్ విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ముత్యాల రాజు, శ్యామ్‌సుందర్, స్వామి, సాంబూనాయక్, విక్రం, సారయ్య, రవి, సుధాకర్, రాజన్న, స్వామి, కొమురయ్య, రాజేందర్, రెడ్డి, సంపత్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలను ఉపసహరించుకోవాలి

గోవిందరావుపేట: కేంద్రం దొడ్డి దారిన తీసుకవచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి సామ చంద్రారెడ్డి అన్నారు. మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ సృజన్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ.. రైతు వ్యతిరేక చట్టాలపై ఆందోళన చేస్తున్న రైతులపై ప్రభుత్వం దాడి చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేస్తున్న రైతులని అక్రమంగా అరెస్ట్ చేసి జైల్లో పెట్టారని వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి ముమ్మడి ఉపేంద్ర చారి, రైతు సంఘం మండల అధ్యక్షుడు రామస్వామి, సభ్యులు కోటేశ్వరరావు, లెనిన్, కృష్ణ, నగేష్, భిక్షం, నాగరాజు, బ్రహ్మాచారి, సూర్యనారయణ, అంజాద్, మహేష్, నరసింహారావు ఉన్నారు.

విద్యార్థుల వివరాలు నమోదు చేయండి

- ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వర్లు

వాజేడు: విదార్థులందరి వివరాలను అపార్(ఆటోమేడెట్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రి)లో నమోదు చేయాలని ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్‌లో విద్యార్థి వివరాలను ఒకసారి నమోదు చేస్తే అతడి చదువుకు సంబంధించిన సర్టిఫికెట్లు, మార్క్ షీట్లు, గ్రేడ్లు, డిగ్రీలు అందులో నిల్వ చేయబడతాయన్నారు. పన్నెండు అంకెల కోడ్‌తో ఎప్పుడైనా తన సమాచారాన్ని పొందవచ్చని తెలిపారు. విద్యార్థుల వివరాలను ఆధార్ కార్డు ఆధారంగా తల్లిదండ్రుల అనుమతితో నమోదు చేయాలని పేర్కొన్నారు. అపార్‌లో నమోదు కాబడ్డ విద్యార్థులు ఒక పాఠశాల నుంచి ఇంకో పాఠశాలకు మారాలన్నప్పుడు సులభంగా ఉంటుందని వివరించారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న వెంకటేశ్వర్లు

విద్య వైజ్ఞానిక సదస్సుకు విద్యార్థులు



వరంగల్ రీజినల్ సెంటర్‌ను సందర్శిస్తున్న విద్యార్థులు

ఏటూరునాగారం: మండలంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు విద్య వైజ్ఞానిక సందర్శనకు తరలివెళ్లారు. సోమవారం వరంగల్‌లోని రీజినల్ సైన్స్ సెంటర్, వెయ్యి స్థంబాల గుడి, వరంగల్ కోట ప్రదేశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సందర్శించి అక్కడ విషయాలను తెలుసుకున్న జీవశాస్త్రం ఉపాధ్యాయుడు పొడెం సమ్మయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సులోచన, సరిత, శోబ, రాములు, రవి, శశిధర్ పాల్గొన్నారు.